## క్లుప్తంగా

### ఆలయ భూములకు వేలం

**పెద్దముడియం :** మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న శ్రీ మాధవ-ఆంజనేయ, శ్రీ ఈశ్వర-వీరభద్ర దేవాలయాలకు సంబంధించిన భూములకు రెండు సంవత్సరాల కౌలుకు బుధవారం ఎండోమెంట్ అధికారులు దేవాలయ ఆవరణలో వేలం పాట నిర్వహించారు. ఇప్పటికే భూములకు వేలం పాట నాలుగు సార్లు వాయిదా పడటంతో అధికారులు వేలం పాట నిర్వహిస్తారో లేదో అని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేసేవారు. బుధవారం రోజు గట్టి పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు వేలం పాట నిర్వహించారు. శ్రీ మాధవ-ఆంజనేయ దేవాలయానికి సంబంధించిన 47.98 ఎకరాలకు గాను రూ.4,72,500, శ్రీ ఈశ్వర-వీరభద్ర దేవాలయానికి సంబంధించిన 11 ఎకరాలకు గాను రూ.1,36,000 గ్రామానికి చెందిన రైతులు వేలం పాట పాడారు.

### బెంగళూరుకు ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం

**సింహాద్రిపురం :** సింహాద్రిపురం నుంచి బెంగళూరుకు వయా పులివెందుల, కదిరి మీదుగా బస్సును ఏర్పాటు చేశామని బుధవారం ఆర్టీసీ డీఎం ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ బస్సు రాత్రి 9 గంటలకు సింహాద్రిపురం నుంచి బయలుదేరుతుందని.. ప్రయాణీకులకు అడ్వాన్స్ టికెట్ బుకింగ్ వెసులుబాటు కల్పించామన్నారు. టికెట్ బుకింగ్ కొరకు 9912864888, 9966452010 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు. దీంతో ఆర్టీసీ డీఎం రామకృష్ణ, జీఎం రావు, తదితర అధికారులకు మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, స్థానికులు, ప్రయాణీకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన



చంద్రబాబు గో బ్యాక్ అంటూ నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న నాయకులు

**పులివెందుల రూరల్ :** టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పులివెందులకు వస్తుండటంతో పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లెలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పనాథరెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు గో బ్యాక్ అంటూ నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు.

### గురుకుల పాఠశాలలో ఆర్డీఓ విచారణ

**కొండాపురం :** మండల పరిధిలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థునులకు సరైన వసతులు కల్పించడంలో గత డిప్యూటేషన్‌లో వచ్చి ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వచ్చేవారని తెలిసిన ఆర్డీఓ శ్రీనివాసులు బుధవారం గురుకుల పాఠశాలలో విచారణ చేపట్టారు. గతంలో డిప్యూటేషన్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన పరిమళ విద్యార్థులకు సరైన వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించారని విద్యార్థులు, తల్లిండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ విషయమై పాఠశాల సిబ్బందిని, పిల్లల తల్లిదండ్రులను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శోభనబాబు, ఉప తహసీల్దార్ మీనా, రీసర్వే డీటీ రాజేశ్వరి, ప్రస్తుత ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు

### బీసీ హాస్టల్ తనిఖీ

**జమ్మలమడుగు రూరల్ (మైలవరం) :** మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాల గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సంయుక్త సంచాలకులు(అమరావతి) ఆర్.శ్రీధర్‌రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి హస్టల్ పరిసరాలను, మరుగుదొడ్లను, విద్యార్థులకు అందిస్తున్న మెనును, రికార్డ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి డి.కృష్ణయ్య, నాగేంద్రరాజు, మనోహర్‌రెడ్డి, హస్టల్ వార్డన్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

### నేడు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రాక

**వేంపల్లె :** స్థానిక ఆర్టీసీ బస్టాండు, కాంప్లెక్స్ నూతన నిర్మాణానికి గురువారం భూమిపూజ, శంకుస్థాపనకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటలకు ఎంపీ వేంపల్లెకు వస్తారని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### రాఘవాచార్యులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

**పులివెందుల టౌన్ :** నాటక రంగం, న్యాయ వృత్తిలో ప్రతిభ చూపిన రాఘవాచార్యులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.బేగ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో తాడిపత్రి రాఘవాచార్యులు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి కళాశాల డీన్ ఎం.ఎస్ బేగ్ ఘనంగా నివాళులర్పించారు.

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

**ఎర్రగుంట్ల :** మండలంలోని కదిరివారిపల్లెలో గురువారం సాయంత్రం 4 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు తెలపవచ్చునన్నారు.

# పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు నీటి విడుదల

- కాలువ కింద పంటల సాగుకు రైతుల సన్నాహాలు
- ఖరీఫ్ సీజన్ చివరి వరకు సాగునీరు



పులివెందుల బ్రాంచ్ కెనాల్‌లో పారుతున్న నీరు



పీబీసీ కాలువ నీటితో సాగులో ఉన్న మినుముపంట

**వేముల :** పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు(పీబీసీ) అధికారులు కొద్దిరోజుల క్రితం నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది వర్షాభావం నెలకొనడంతో ఖరీఫ్‌లో సకాలంలో పంటలు సాగు కాలేదు. వర్షం కోసం ఎదురుచూసిన రైతులకు వరుణుడు కరుణించలేదు. దీంతో వర్షాధారం కింద పంటలు సాగయ్యే పొలాలన్ని బీళ్లుగానే ఉన్నాయి. ఇప్పటికే ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు సీజన్ ముగిసింది. దీంతో రైతులు స్వల్పకాలిక పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా అధికారులు పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. పీబీసీ కింద, డిస్ట్రిబ్యూటరీల కింద రైతులు పంటలు సాగు చేసుకునేలా నీటిని విడుదల చేశారు. ఖరీఫ్ సీజన్ పూర్తయ్యే వరకు సాగునీరు అందించాలని అధికారులు నిర్ణయించారు. డిస్ట్రిబ్యూటరీల కింద ఇంజన్లు, విద్యుత్ సౌకర్యం ఉన్నట్లయితే మోటార్ల ద్వారా సాగునీటిని అందించేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని లింగాల, పులివెందుల, వేముల, వేంపల్లె మండలాల్లో పీబీసీ కింద ఉన్న రైతులు పంటల సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కొంతమంది రైతులు పంటలు సాగు చేశాక నీటిని ఆపేస్తే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అయితే అధికారులు మాత్రం పీబీసీ, ఉప కాలువల కింద పంటలు సాగు చేసే పంటకాలం పూర్తయ్యే వరకు నీటిని విడుదల చేస్తామని అధికారులు భరోసా ఇస్తున్నారు.

ఇప్పటికే పీబీసీ కింద పత్తి పంట సాగు చేసుకున్న రైతులు నీటిని విడుదల చేయడంతో ఇంజన్ల ద్వారా పత్తి పంటకు సాగునీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం పీబీసీ కింద మినుము పంట సాగు చేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఉప కాలువల కింద పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా నీటిని విడుదల చేస్తున్నారు.

**సీజన్ చివరి వరకు నీటిని విడుదల చేస్తాం**

ఖరీఫ్ సీజన్ ముగిసే వరకు పీబీసీకి నీటిని విడుదల చేస్తాం. ఇప్పటికే పీబీసీకి నీటిని విడుదల చేశాం. రైతులు ఎలాంటి సందేహం లేకుండా పీబీసీ కింద గానీ, ఉప కాలువల కింద పంటలు సాగు చేసుకోవచ్చు పంట కాలం పూర్తయ్యే వరకు సాగునీటిని అందిస్తాం. ఆందోళన లేకుండా పంటలు సాగు చేసుకోండి. ఖరీఫ్ వర్షాభావం నెలకొని పొలాలన్ని బీళ్లుగా ఉన్నాయి. వర్షాధారం కింద సాగయ్యే పొలాల్లో పీబీసీ నీటితో పంటలు సాగు చేయండి. సాగునీటిపై ఎవరూ ఆందోళణ పెట్టుకోవద్దు. పంటలు సాగు చేసినా రైతులను ఇబ్బంది పెట్టం.

– రాజశేఖర్(పీబీసీ ఈఈ), పులివెందుల

### రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

**పులివెందుల :** పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌తో మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

# పేదలకు కార్పొరేట్ విద్య, వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



కోవరంగుంటపల్లెలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

**సింహాద్రిపురం :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతంలోని ప్రతి నిరుపేదకు కార్పొరేట్‌స్థాయి విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యం అందించడానికి కార్పొరేట్ స్థాయిలో రూ.1.86కోట్లతో ఆసుపత్రి భవనాలు ఏర్పాటు చేసి అన్ని పరికరాలు, అన్ని వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చి ఏ ఒక్కరికి వైద్యం భారం కాకూడదని ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణంలో ఆయన మొక్కలు నాటారు. రూ.70లక్షల పాడా నిధులతో ప్రభుత్వ పాఠశాలకు నాలుగు భవనాలు, రెండు డిజిటల్ టీవీలను అందించారు. అలాగే రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే వైఎస్సార్ హయాంలో అంకాలమ్మగూడూరు చెరువుకు వెళ్లే బలపనూరు వన్నార్ కాలువను ఏర్పాటు చేయడం జరిగిందని ఆ కాలువకు ఎంపీ సీసీ లైనింగ్ వేయించి నీటిని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను బాలింతలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఝాన్సీరాణి, ఎంపీపీ అరుణ, మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శివారెడ్డి, సీడీపీఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబునాయుడు సీమ ద్రోహి

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజం



విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

**కమలాపురం :** ప్రతిపక్ష నేత చంద్రబాబు సీమ ద్రోహి అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం మండలంలోని దేవరాజుపల్లెలో రూ.20.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యమే పరమావధిగా ప్రతి సచివాలయ పరిధిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను నిర్మించి వైద్య సేవలను ప్రజల ముంగిటకే తీసుకు వచ్చారన్నారు. ఫ్యామిలి డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రజలకు వైద్య సేవలు మరింత దగ్గరయ్యాయన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కేవలం ఒక్క పట్టిసీమ పేరు చెప్పి రాష్ట్రాన్ని గాలికొదిలేశాడని మండిపడ్డారు. అది కూడా మహానేత వైఎస్సార్ తవ్విన కాలువలో నీళ్లు ఎత్తిపోశాడన్నారు. అంతకు మించి చంద్రబాబు ఏమి చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలొచ్చే సమయానికి ప్రాజెక్టుల సందర్శన అని డ్రామాలు మొదలు పెట్టాడన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నకేశవరెడ్డి, కిరణ్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, పీఆర్ ఏఈ వెంకటసుబ్బయ్య, మెడికల్ ఆఫీసర్ ప్రసూన, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ ఫలాలు**

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కమలాపురం 4వ వార్డు సచివాలయ పరిధిలోని క్రాస్‌రోడ్డు, పైడిమాను కాలనీ, అక్కదేవతల కాలనీ, శ్రీనగర్ కాలనీ, కొత్తపల్లె తదితర కాలనీల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలిసి ప్రతి గడపకు తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. సీఎం ఆశయ సాధనకు తామంతా ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

**పులివెందుల :** స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాస ప్రాంగణంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ పతాక రూప శిల్పి పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, గండి రాము, మల్లి, ఖాదర్‌బాషా, రంగనాయకులు పాల్గొన్నారు.

**వేంపల్లె :** స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు తెలిపారు. ఇడుపులపాయలోని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఎన్ఎస్ఎస్-15 ప్రోగ్రాం అధికారి డాక్టర్ మధుసూదన్ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



భూతూరి శేఖర్ (ఫైల్)



వెంకటరమణ (ఫైల్)

**జమ్మలమడుగు రూరల్ :** ప్రొద్దుటూరు రహదారి బైపాస్ సమీపంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న సంఘటనలో భూతూరి శేఖర్(36) మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు పట్టణ పరిధిలో ఉన్న కన్నెలూరు గ్రామానికి చెందిన భూతూరి శేఖర్ కూలీ పనులు చేసుకుని జీవించేవాడు. బుధవారం సొంతపనుల నిమిత్తం భార్యతో కలసి ప్రొద్దుటూరుకు వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి బైక్‌లో కన్నెలూరుకు వస్తుండగా జమ్మలమడుగు సమీపంలో ఉన్న బైపాస్ వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొంది. శేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులను వివరణ కొరగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. వ

**విద్యుదాఘాతంతో మరో యువకుడు..**

పెద్దముడియం మండలం కొండసుంకేసుల గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కె.వెంకటరమణ(27) విద్యుత్ ఘాతంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటరమణ ఇంటి వద్ద నుంచే విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామంలో కొత్తఇల్లు నిర్మిస్తుండటంతో బుధవారం ఇంటి గొడలకు నీరు కొట్టిందుకు ఇంటిలో ఉన్న మోటారు ఆన్‌చేయడంతో విద్యుత్ షాక్ గురయ్యాడు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. వెంకటరమణకు కర్నూల్ జిల్లాకు చెందిన ఓ యువతితో నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం.

### ఆర్టీపీపీలో కొనసాగుతున్న నిరసన

**ఎర్రగుంట్ల :** ఆర్టీపీపీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని చేస్తున్న నిరసన కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. ఆర్టీపీపీ స్ట్రగుల్ కమిటీ అధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. వేతన సవరణ విషయంలో యాజమాన్యం తీరు మారలేదన్నారు.

### సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

**వేముల :** మండల వ్యాప్తంగా సమస్యలపై చర్యలు తీసుకుని పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సమస్యలపై మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో 230 మంది రైతులకు సంబంధించి చుక్కల భూములకు పరిష్కారం కాలేదని.. ఈ విషయంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించినట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి జేసీ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఇప్పటివరకు నా దృష్టికి రాలేదని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మండలంలోని వి.కొత్తపల్లె, వేముల గ్రామాల్లో జరుగుతున్న జగనన్న కాలనీలకు సంబంధించి సరఫరా చేసిన సిమెంటును వర్క్ ఇన్‌స్పెక్టర్ అమ్ముకున్నారని.. సిమెంటు లేక నిర్మాణాలు జరగలేదని రాఘవరెడ్డి, మల్‌రెడ్డిలు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత వర్క్ ఇన్‌స్పెక్టర్ నుంచి రికవరీ చేసి సిమెంటు సరఫరా చేస్తామన్నారు. గతంలో ఐటీఐ నిర్మాణానికి 5 మంది దళిత రైతులకు ఇచ్చిన డీకేటీ భూములు తీసుకున్నారని.. వేరే చోట డీకేటీ పట్టాలు ఇస్తామని చెప్పారని.. ఇంతవరకు ఇవ్వలేదని మండల ఇన్‌చార్జి జేసీకి విన్నవించారు. ఆర్డీఓ వెంకటేశులు, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, కో అప్షన్ సభ్యులు మండి మాపీరా, నాయకులు వెంకటనారాయణ, రాఘవరెడ్డి, మల్‌రెడ్డి, గంగులయ్య పాల్గొన్నారు.

# బీటీ రోడ్డు పనులపై ఓఎస్డీ అసంతృప్తి



పంచాయతీరాజ్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

**పులివెందుల :** బీటీ రోడ్డు అసంపూర్తి పనులపై పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక పాడా ఓఎస్డీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో రోడ్డు పనులపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు కొంత వరకు మొదలుపెట్టి తర్వాత అసంపూర్తిగా వదిలేయడం సరైన విధానం కాదన్నారు. అచ్చివెళ్లి – గుండ్ల మడుగు, ఇ.కొత్తపల్లె నుంచి జేకే రోడ్డు వరకు, నల్లపురెడ్డిపల్లె–హిరోజీపురం, హిమకుంట్ల – అంకేవానిపల్లె, గురిజాల–వెన్నపూసపల్లె, రావులకొలను–ఇనగలూరు రోడ్డు పనులలో కొన్ని పనులు పూర్తి కాగా.. మరికొన్ని మొదలు పెట్టారన్నారు. అలాగే నియోజకవర్గంలో ఏ రోడ్డు పనులు కూడా అసంపూర్తిగా కాకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈలు ఓబుళరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, డీఈ సుధాకర్‌రెడ్డి, పాడా కార్యాలయ అధికారులు రామాంజులరెడ్డి, శివశంకర్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులకు భూమిపూజ



రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**కొండాపురం :** మండలంలోని టి.కోడూరు గ్రామంలో తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేసి మాట్లాడారు. పెన్నానది పరివాహక గ్రామాలకు వెళ్లే రోడ్డు సరిగా లేకపోవడంతో వంగనూరు నుంచి టి.కోడూరు వరకు 2.7 కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రాయలసీమ ప్రాంతంలో ప్రాజెక్టులకు ఏమీ చేయకుండానే నేడు ప్రాజెక్టుల సందర్శనకు చంద్రబాబు రావడం సిగ్గుచేటన్నారు. గండికోట ప్రాజెక్టు, పైడిపాళెం రిజార్వాయర్‌లను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 90 శాతం పూర్తి చేసిన ఘనత వైఎస్ కుటుంబంకే చేందుతుందన్నారు. చంద్రబాబు ఎన్ని మాయ మాటలు చెప్పిన ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో చింత రాజారెడ్డి, ఎస్.రామసుబ్బారెడ్డి, ఎస్.భాస్కర్‌రెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, రామసుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, యస్వంత్ రెడ్డి, సర్పంచ్ రాఘవేంద్రరెడ్డి, ఆర్. హరినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నూతన భవనాలను త్వరగా పూర్తిచేయాలి

**ఎర్రగుంట్ల :** పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవనం, పబ్లిక్ హెల్త్ కేంద్రం భవనాలను తొందరగా పూర్తిచేయాలని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం తన చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యాలయ భవనాలను ఆధునీకరణగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పీ జగన్నాథ్, కౌన్సిలర్ మహమ్మద్‌ఆలీ, నాగిరెడ్డి, చంద్రారెడ్డిలు, ఏఈ సురేష్, ఆర్‌ఓ గంగిరెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, పార్టీ నాయకులు డేవిడ్‌లు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సంపూర్ణ పోషణతో తల్లీ బిడ్డలకు సంరక్షణ

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



చెన్నూరులో మహిళకు కోడిగుడ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



పులివెందులలో కిట్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు



వేములలో గర్భిణులకు వైఎస్సార్ కిట్లను అందిస్తున్న మండల ఇన్‌చార్జి, ఎంపీపీ

**చెన్నూరు :** గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ప్రభుత్వం వారికి సంపూర్ణ పోషకాలు అందిస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవన్ (వెలుగు కార్యాలయం)లో బుధవారం గర్భిణులు, బాలింతలకు ఆయన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దూరదృష్టి గల నాయకుడు కాబట్టి తల్లి బిడ్డల క్షేమం కోసం, అలాగే వారి ఆరోగ్య దృష్ట్యా ఆరోగ్యకరమైన సంపూర్ణ పోషక ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో, ఇటు ఆరోగ్య కేంద్రంలో వారికి ప్రతినెల సరైన టీకాలు అందించడంతోపాటు, సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందిస్తారన్నారు. దీంతో పుట్టబోయే బిడ్డ ఎలాంటి లోపాలు లేకుండా ఆరోగ్యంగా ఉండేటట్లు ప్రభుత్వం చేస్తోందన్నారు. ఎంపీడీఓ గంగనపల్లి సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ దిలీప్‌రెడ్డి, ఎంపీపీ చిర్ల సురేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌పీఎస్‌ఆర్, సీడీపీఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

**కమలాపురం :** స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఐసీడీఎస్ సీడీపీఓ సుజామణి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గండి భారతి, మున్సిపల్ చైర్మన్ మార్పూరి మేరి, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

**పులివెందుల రూరల్ :** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ సీడీపీఓ శ్రీలత ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ గర్భిణు, బాలింత మహిళలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వాలు మహిళా సంక్షేమానికి కృషి చేయలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కిశోర్, లక్ష్మీభార్గవి, లక్ష్మీప్రసన్న, గుల్జార్, కాంతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు డేనియల్ బాబు, కొండయ్య, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

**వేముల :** గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు తెలిపారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, సర్పంచ్ రామాంజనమ్మ, సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**వీరపునాయునిపల్లె :** మండల పరిధి నేలతిమ్మాయపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ పౌష్టికాహార కిట్లను రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాపురెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచు విజయరాముడు, ఎంపీటీసీ శివసంధ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వేంపల్లె :** స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–10, 11ల వద్ద బుధవారం చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారిణి వి.సునీత ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీ గాయత్రి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మెయిన్ పాఠశాల వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఎంపీటీసీ కటిక చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత నిస్సార్ బాషాలు పంపిణీ చేశారు.

**ఎర్రగుంట్ల :** పట్టణంలోని శాంతినగర్ కాలనీలో వలసపల్లి రోడ్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం–2లో గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను 13వ వార్డు ఇన్‌చార్జీ కౌన్సిలర్ మహమ్మద్ గౌస్(కోకోకోల గౌస్) అందజేశారు. ఆ వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**చక్రాయపేట :** చక్రాయపేటలో జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులకు, బాలింతలకు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లీలావతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

**ముద్దనూరు :** స్థానిక ప్రాథమిక పాఠశాలలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్‌ను బుధవారం ముద్దనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ముతాజ్‌బేగం పంపిణీ చేసి మాట్లాడారు. టేక్ హోం రేషన్ ద్వారా 5 రకాల వస్తువులను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనం సరళ, ఎంపీటీసీ సభ్యురాలు పుష్పలత పాల్గొన్నారు.

**జమ్మలమడుగు రూరల్ :** స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం మండల ఎంపీపీ గుద్దేటి హరిత వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పౌష్టికాహార కిట్లను గర్భిణులకు, బాలింతలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్ర నాథ్, తహసీల్దార్ గురప్ప తదితరులు పాల్గొన్నారు.

**తొండూరు :** మండలంలోని తొండూరు, మల్లేల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుధవారం మాజీ ఎంపీపీ జయప్రద, సర్పంచ్ రజియ, ఎంఈఓ భాస్కర్‌రెడ్డిల చేతులమీదుగా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.